జడేజా పాంచ్ పటాకా

తొలి రోజు న్యూజిలాండ్ 235 ఆలౌట్ • సుందర్‌కు 4 వికెట్లు • భారత్ 86/4

ముంబై: సీనియర్ స్పిన్నర్ రవీంద్ర జడేజా (5/65)తో పాటు యువ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ (4/81) బంతితో మాయ చేయడంతో మూడో టెస్టులో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు 235 పరుగులకు ఆలౌట్ అయింది. ముంబైలోని వాంఖడే వేదికగా జరుగుతున్న టెస్టులో జడేజా, సుందర్ ధాటికి కివీస్ బ్యాటర్లలో డారెల్ మిచెల్ (82), విల్ యంగ్ (71) మినహా ప్రధాన బ్యాటర్లంతా చేతులెత్తేశారు. స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై భారత స్పిన్ ద్వయం క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టడంతో పర్యాటక జట్టు రెండు సెషన్లలోనే తోకముడిచింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. న్యూజిలాండ్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కున్నా చివరి రెండు ఓవర్లలో కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (31 నాటౌట్), రిషభ్ పంత్ (1 నాటౌట్) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఇంకా 149 పరుగులు వెనుక బడి ఉంది.

టాప్-5లోకి జడ్డూ

ఈ మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసిన జడేజా మరో ఘనత సాధించాడు. టెస్టులలో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో జడేజా 312 వికెట్లతో ఐదో స్థానంలో నిలిచాడు. 311 వికెట్లతో ఉన్న ఇషాంత్, జహీర్‌ను జడ్డూ అధిగమించాడు. ఈ జాబితాలో కుంబ్లే (619), అశ్విన్ (533), కపిల్ దేవ్ (434), హర్భజన్ సింగ్ (417) తర్వాత జడేజా ఉన్నాడు. టాప్-5లో ఉన్న బౌలర్లలో కపిల్ దేవ్ మినహా మిగిలిన నలుగురూ స్పిన్నర్లే కావడం విశేషం. టెస్టులలో 5 వికెట్లు తీయడం జడేజాకు ఇది 14వ సారి.

జడ్డూ, సుందర్ మాయ

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్‌కు 4వ ఓవర్లోనే తొలి షాక్ తగిలింది. ఈ సిరీస్‌లో ఫామ్‌లో ఉన్న డెవాన్ కాన్వే (4) ఆకాశ్ దీప్‌కు వికెట్ల ముందు దొరికిపోయాడు. వన్‌డౌన్‌లో వచ్చిన యంగ్.. సారథి లాథమ్ (28)తో కలిసి రెండో వికెట్‌కు 44 పరుగులు జోడించాడు. సుందర్ 16వ ఓవర్లో లాథమ్‌ను ఔట్ చేసి ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. వాషింగ్టన్ అదే ఊపులో రచిన్ (5)నూ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ క్రమంలో మిచెల్‌తో జతకలిసిన యంగ్.. భారత బౌలర్లను సమర్థవంతంగా అడ్డుకున్నాడు. లంచ్ తర్వాత అర్ధ సెంచరీ పూర్తిచేసుకుని శతకం దిశగా సాగుతున్న యంగ్.. జడేజా 45వ ఓవర్లో స్లిప్స్‌లో రోహిత్‌కు క్యాచ్ ఇవ్వడంతో 87 పరుగుల 4వ వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. జడ్డూ అదే ఓవర్లో బ్లుండెల్‌ను డకౌట్ చేసి కివీస్‌ను మరింత కష్టాల్లోకి నెట్టాడు. గ్లెన్ ఫిలిప్స్ (17) కూడా జడ్డూ మాయాజాలానికి బలయ్యాడు. వరుసగా వికెట్లు పడటంతో పాటు కాలునొప్పి వేధిస్తున్నా క్రీజులో నిలిచిన మిచెల్ అర్ధ సెంచరీ తర్వాత సుందర్ బౌలింగ్‌లో బంతిని కట్ చేయబోయి రోహిత్ చేతికి చిక్కాడు.

'రోకో' మళ్లీ విఫలం

కివీస్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసిన భారత్.. చివరిదాకా ఆధిపత్యం చెలాయించినా ఆఖర్లో కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. 7వ ఓవర్లోనే సారథి రోహిత్ శర్మ (18) స్లిప్స్‌లో లాథమ్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. యశస్వి జైస్వాల్ (30), గిల్ కుదురుకుని భారత స్కోరు వేగాన్ని పెంచారు. కానీ అజాజ్ పటేల్ వేసిన 18వ ఓవర్లో రివర్స్ స్వీప్ చేయబోయిన జైస్వాల్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. నైట్ వాచ్‌మెన్‌గా వచ్చిన మహ్మద్ సిరాజ్ మరుసటి బంతికే డకౌట్ అయ్యాడు. క్రీజులోకి రావడంతోనే ఫోర్ కొట్టిన కోహ్లీ (4) అనవసర పరుగుకు యత్నించి రనౌట్ అయ్యాడు. 17 ఓవర్లకు 78/1గా ఉన్న భారత్.. ఆట ఆఖరి 2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 86/4గా నిలిచింది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 65.4 ఓవర్లలో 235 ఆలౌట్ (మిచెల్ 82, యంగ్ 71, జడేజా 5/65, సుందర్ 4/81)

భారత్ తొలి ఇన్నింగ్స్: 19 ఓవర్లలో 86/4 (గిల్ 31 నాటౌట్, జైస్వాల్ 30, అజాజ్ 2/33, హెన్రీ 1/15)

కుర్రాళ్లపై కాసుల వర్షం

భావి క్రికెటర్లపై భారీగా వెచ్చించిన ఫ్రాంచైజీలు

అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా ధోనీ

వేలంలోకి పంత్, శ్రేయస్, రాహుల్ • క్లాసెన్‌కు అత్యధిక ధర

ముంబై: త్వరలో జరుగబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మెగా వేలానికి ముందు ఫ్రాంచైజీలు తాము అట్టిపెట్టుకునే ఆటగాళ్ల (రిటెన్షన్) జాబితాను గురువారం విడుదల చేశాయి. రిటెన్షన్‌లో స్టార్ క్రికెటర్లు భారీ ధర దక్కించుకున్నా చాలా ఫ్రాంచైజీలు యువ క్రికెటర్లపై కాసుల వర్షం కురిపించాయి. యశస్వీ జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, రింకూ సింగ్, రజత్ పాటిదార్ , రవి బిష్ణోయ్, మయాంక్ యాదవ్, తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, సాయి సుదర్శన్ వంటి కుర్రాళ్లకు జాక్‌పాట్ దక్కింది. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆయా ఫ్రాంచైజీలు కొత్తవారిపై కోటానుకోట్లు కుమ్మరించాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ వికెట్ కీపర్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్‌కు అత్యధికంగా రూ. 23 కోట్లు వెచ్చించింది. ఆర్సీబీ మాజీ సారథి విరాట్ కోహ్లీకి భారత ఆటగాళ్లలో మునుపెన్నడూ లేనంతగా ఏకంగా ఆ జట్టు రూ. 21 కోట్లు పెట్టి రిటైన్ చేసుకోగా ముంబైని వీడతాడని ఊహాగానాలు వచ్చినా రోహిత్ శర్మ ఆ జట్టుతోనే కొనసాగనున్నాడు. ఈ సీజన్‌లో దిగ్గజ సారథి మహేంద్రసింగ్ ధోనీ తన కెరీర్‌లో తొలిసారి అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా బరిలోకి దిగనున్నాడు. పంజాబ్ మినహా మిగిలిన జట్లు తమ కోర్ గ్రూప్ ఆటగాళ్లను రిటైన్ చేసుకున్నాయి. రిటెన్షన్ లిస్ట్‌లో లేని ఆటగాళ్లు ఈ నెల చివరివారంలో జరగాల్సి ఉన్న వేలంలో పాల్గొంటారు.

ఇది తగునా గోయెంకా!

లక్నో రిటెన్షన్ జాబితా అనంతరం ఆ జట్టు యజమాని సంజీవ్ గొయెంకా చేసిన వ్యాఖ్యలు మరోసారి వివాదాస్పదమయ్యాయి. 'ఆటగాళ్ల ఎంపికలో మేము గెలవాలన్న లక్ష్యంతో ఉన్నవారినే ఎంపికచేశాం. వ్యక్తిగత లక్ష్యాలకు దూరంగా జట్టు విజయం కోసం ఆడేవారికే ప్రాధాన్యతనిచ్చాం' అని చెప్పడం వివాదాస్పదమైంది. కేఎల్ రాహుల్‌ను ఉద్దేశించే గొయెంకా ఆ వ్యాఖ్యలు చేసి ఉంటాడని అయనపై నెట్టింట అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రిటెన్షన్ ఆటగాళ్ల జాబితా

ఆటగాళ్లు	రూ.(కోట్లలో)
చెన్నై	
రుతురాజ్	18
పతిరాన	13
దూబె	12
జడేజా	18
ధోనీ	04
ఖర్చు చేసిన మొత్తం	65
మిగిలిన నగదు	55
ఢిల్లీ	
అక్షర్	16.50
కుల్‌దీప్	13.25
స్టబ్స్	10
అభిషేక్	04
ఖర్చు చేసిన మొత్తం	47
మిగిలిన నగదు	73
కోల్‌కతా	
రింకూ	13
వరుణ్	12
నరైన్	12
రస్సెల్	12
హర్షిత్	04
రమణ్‌దీప్	04
ఖర్చు చేసిన మొత్తం	69
మిగిలిన నగదు	51
బెంగళూరు	
కోహ్లీ	21
పాటిదార్	11
దయాల్	05
ఖర్చు చేసిన మొత్తం	37
మిగిలిన నగదు	83
లక్నో	
పూరన్	21
బిష్ణోయ్	11
మయాంక్	11
మోహ్సిన్	04
అయూష్	04
ఖర్చు చేసిన మొత్తం	51
మిగిలిన నగదు	69

ఆటగాళ్లు	రూ.(కోట్లలో)
పంజాబ్	
శశాంక్	5.5
ప్రభ్‌సిమ్రన్	04
ఖర్చు చేసిన మొత్తం	9.5
మిగిలిన నగదు	110.5
ముంబై	
బుమ్రా	18
సూర్యకుమార్	16.35
హార్దిక్	16.35
రోహిత్	16.30
తిలక్	08
ఖర్చు చేసిన మొత్తం	75
మిగిలిన నగదు	45
హైదరాబాద్	
క్లాసెన్	23
కమిన్స్	18
అభిషేక్	14
హెడ్	14
నితీశ్	06
ఖర్చు చేసిన మొత్తం	75
మిగిలిన నగదు	45
రాజస్థాన్	
శాంసన్	18
జైస్వాల్	18
పరాగ్	14
జురెల్	14
హెట్‌మెయర్	11
సందీప్	04
ఖర్చు చేసిన మొత్తం	79
మిగిలిన నగదు	41
గుజరాత్	
రషీద్	18
గిల్	16.50
సుదర్శన్	8.50
తెవాటియా	04
షారుక్	04
ఖర్చు చేసిన మొత్తం	51
మిగిలిన నగదు	69

అనుమానాలే నిజమై..

ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌తో పాటు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ తమ సారథులను వేలానికి వదిలేశాయి. అందరూ ఊహించినట్టుగానే రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ వేలంలోకి వస్తుండగా పదేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత కోల్‌కతాకు టైటిల్‌ను అందించిన శ్రేయస్ అయ్యర్ కూడా వేలానికి సిద్ధమయ్యాడు. పంత్, రాహుల్, శ్రేయస్‌తో ఆయా జట్ల యాజమాన్యాలు చివరి నిమిషం వరకూ చర్చలు జరిపినా ఫలితం లేకుండాపోయింది. ఈ ముగ్గురూ వేలంలో భారీ ధర దక్కించుకునే అవకాశాలున్నాయి. వయసు రీత్యా ఆర్సీబీ డుప్లెసిస్‌ను రిటైన్ చేసుకోకపోగా కొద్దిరోజుల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన శిఖర్ ధావన్‌నూ పంజాబ్ వదిలేసుకుంది. గత సీజన్‌లో విఫలమైన మ్యాక్స్‌వెల్, సిరాజ్‌ను ఆర్సీబీ రిటైన్ చేసుకోలేదు. పంజాబ్ ఏ ఒక్క క్యాప్డ్ ప్లేయర్‌నూ రిటైన్ చేసుకోకపోవడం గమనార్హం. ఇద్దర్ని మాత్రమే ఆ జట్టు రిటైన్ చేసుకుంది. రిటెన్షన్ ప్రక్రియ ముగిశాక ఆ జట్టు ఖాతాలో అత్యధికంగా రూ. 110.5 కోట్ల నగదు మిగిలుంది. దాదాపు అన్ని ఫ్రాంచైజీలు ఐదుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోగా ఢిల్లీ నలుగురిని, బెంగళూరు ముగ్గురిని, పంజాబ్ ఇద్దర్ని రిటైన్ చేసుకున్నాయి.

ఆరెంజ్ ఆర్మీ ఇదే..

గత సీజన్‌లో ఫైనలిస్టులు సన్‌రైజర్స్ అందరూ అనుకున్నట్టుగానే తమ ప్రధాన ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. రిటెన్షన్‌లో అనూహ్యంగా క్లాసెన్‌పై రూ. 23 కోట్లు వెచ్చించిన హైదరాబాద్.. సారథి పాట్ కమిన్స్‌ను రెండో రిటెన్షన్ (రూ. 18 కోట్లు)గా తీసుకుంది. విధ్వంసక ఓపెనింగ్ ద్వయం అభిషేక్, ట్రావిస్ తలా రూ. 14 కోట్లు కొల్లగొట్టారు. యువ ఆల్‌రౌండర్ నితీశ్‌కు రూ. 6 కోట్లు దక్కాయి

టీపీజీఎల్ నాలుగో సీజన్ ప్రారంభం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: శ్రీనిధి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ (టీపీజీఎల్) శుక్రవారం అట్టహాసంగా మొదలైంది. స్థానిక హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేశ్ శర్మ టీపీజీఎల్ నాలుగో సీజన్‌ను ప్రారంభించారు. ఈనెల 2 నుంచి 30 దాకా జరిగే ఈ టోర్నీలో 16 జట్లు పాల్గొననుండగా టాప్ 8లో నిలిచిన జట్లు నాకౌట్ స్టేజ్‌కు అర్హత సాధిస్తాయి. నాలుగో సీజన్ ప్రారంభోత్సవం సందర్భంగా గవర్నర్ గోల్ఫ్ ఆడి ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. అనంతరం హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అత్యున్నత ప్రమాణాలతో నిర్వహిస్తున్న హెచ్‌జీఏ గోల్ఫ్ క్లబ్‌ను పరిశీలించారు. డంపింగ్ యార్డును గోల్ఫ్ కోర్సునుగా మార్చి టోర్నీలను నిర్వహించడం అభినందనీయమని గవర్నర్ ప్రశంసించారు. శ్రీనిధి కేవలం చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తోందని విద్యాసంస్థల గ్రూప్ చైర్మన్ కటికనేని తాహెర్ మహి తెలిపారు

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.